క్లుప్తంగా

పెంపుడు జంతువులకు రేపు వ్యాక్సినేషన్

నల్లజర్ల: వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు జంతువులకు నల్లజర్ల పశువైద్యశాల వద్ద శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నల్లజర్ల పశు వైద్యశాల ఏడీఏ డాక్టర్ జాన్‌మోజెష్ వెస్లీ తెలిపారు. మూగ జీవాలంటే కొందరికి అమితమైన ప్రేమ ఉంటుందని, అవి కూడా కుటుంబంలో భాగంగా మారుతాయన్నారు. జంతువుల లాలాజలం, తాకిడి, విసర్జకాల ద్వారా అనేక వ్యాధులు మనుషులకు సంక్రమిస్తాయన్నారు. వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడమే వరల్డ్ జూనోసిస్ డే ప్రధాన లక్ష్యమన్నారు. రేబిస్‌కి వ్యాక్సిన్ కనుగొన్న ప్రఖ్యాత జీవ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ తొలిసారి కుక్క కాటు బాధితుడికి వ్యాక్సిన్ వేసిన రోజును గుర్తు చేసుకుంటూ ఏటా జూలై 6న వరల్డ్ జూనోసిస్ డే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే అసాధారణ ఆరోగ్య స్థితిని కూడా వైద్య పరిభాషలో జూనోసిస్ అంటారన్నారు. పెంపుడు జంతువులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలన్నారు.

ఘనంగా రోశయ్య జయంతి


కొవ్వూరులో రోశయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కొవ్వూరు: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మంటపం వద్ద ఉన్న రోశయ్య విగ్రహానికి సంఘ నాయకులు నివాళులర్పించారు. తమిళనాడు గవర్నర్‌గాను, ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగాను ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మద్దుల సోమరాజు, మద్దుల సత్యనారాయణ, ఎంబీఎస్ ప్రసాద్, నాళం వీరవెంకట శ్రీనివాస్, తుమ్మలపల్లి రమేష్, కొల్లేపర శ్రీనివాస్, చెక్కా శ్రీనివాస్, కొత్త మాసు వాసు, వలివేటి ప్రసాద్, కక్కిరాల సూరిబాబు, దేవాతు ప్రసాద్, వంకాయల శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

కొవ్వూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత తెలిపారు. ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన పరీక్ష పాసైన విద్యార్థులు అర్హులన్నారు. డిగ్రీలో బీఏ హిస్టరీ,బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ బోటనీ, కెమిస్ట్రీ, మాథ్స్ కోర్సులు అందు బాటులో ఉన్నాయన్నారు. అడ్మిషన్ కోరే విద్యార్థులు శుక్రవారం ఉదయం పది గంటల నుంచి కళాశాలలో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 79892 01001, 94941 65717, 08813–297035 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సారా బట్టీపై దాడి

గోపాలపురం: సగ్గొండ గ్రామంలో సారా బట్టీపై గురువారం దాడి చేసినట్టు ఎస్సై కర్రి సతీష్‌కుమార్ తెలిపారు. ఇందులో 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు చెప్పారు. సగ్గొండకు చెందిన నక్కా సత్యనారాయణను అరెస్టు చేశారు. ప్లాస్టిక్, అల్యూమినియం సామాన్లను స్వాధీనం చేసుకున్నారు.

స్వచ్ఛ సంకల్పం పరిశీలన

చాగల్లు: పంచాయతీ పరిధిలో జరుగుతున్న స్వచ్ఛ సంకల్ప కార్యక్రమాలను డీఎల్పీఓ దాసరి రాంబాబు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందికి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు, ఏఎన్ఎంలకు ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌ల క్లీనింగ్, తాగు నీటి స్వచ్ఛత పరీక్ష, పారిశుధ్యం తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీఓ ఎస్.బుజ్జితో కలిసి మంచి నీటి ట్యాంకును పరిశీలించారు.

దిష్టిబొమ్మ దహనం

చాగల్లు: పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని బీజేపీ నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు. చాగల్లు సెంటర్‌లో దిష్టిబొమ్మను దహనం చేశారు.

కార్మిక నేతకు నివాళి

కొవ్వూరు: కార్మిక ఉద్యమ నేత, సీఐటీయూ రాష్ట్ర నాయకులు అల్లూరి సత్యనారాయణ పదో వర్ధంతిని స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఉమ్మడి జిల్లా సీఐటీయూ కార్యదర్శిగా మూడు దశాబ్దాలకు పైగా సేవలందించారని వక్తలు కొనియాడారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

నిడదవోలు: పట్టణంలోని గాంధీనగర్ ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు నిడదవోలు ఈపీడీసీఎల్ ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. గాంధీనగర్, మార్కెట్, బస్టాండ్ సెంటర్, రైల్వేస్టేషన్ రోడ్, రాయిపేట, ఇందిరానగర్, జ్యోతికాలనీ, సుబ్బరాజుపేట, ఎన్టీఆర్‌కాలనీ, సింగవరం ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ఖర్చు తగ్గు.. రాబడి పెంపు..

- ట్రేల్లో మడులు, ఊడ్పు యంత్రంతో నాట్లు
- సాంకేతిక విధానాలతో అన్నదాతకు మేలు
- అనుసరించాలంటున్న వ్యవసాయ అధికారులు


మేరీ కిరణ్

పెరవలి: ఖరీఫ్ పంట వేసే వరి రైతులు ఆకుమడులు వేయకుండా ట్రేల్లో డ్రమ్ సీడర్‌తో విత్తనాలు విత్తుకుంటే ఖర్చు తక్కువ కావడంతో పాటు, సమయం ఆదా అవుతుందని పెరవలి వ్యవసాయాధికారి మేరీ కిరణ్ అంటున్నారు. మాన్యువల్ సీడింగ్ మెషీన్(విత్తనం విత్తే మెషీన్)తో ఆకుమడులు కట్టటం ఎంతో సులువని, కేవలం ఇద్దరు వ్యక్తులతో మడులు కట్టవచ్చని తెలిపారు. సాధారణ ఆకుమడిలో నాట్లు వేయడానికి 25 నుంచి 30 రోజుల సమయం పడితే, ఈ ట్రేలలో విత్తనాలు వేస్తే కేవలం 14 రోజులు సరిపోతుందని వివరించారు. ఈ రెండు పద్ధతుల్లో ప్రస్తుత పరిస్థితులను మేరకు మెషీన్‌తో విత్తనాలు వేసుకోవడమే సరైనదని చెబుతున్నారు. కాగా నిడదవోలు నియోజకవర్గంలో ఖరీఫ్‌కు 36 వేల ఎకరాల్లో సాగు చేస్తుండగా, వీటిలో పెరవలి మండలంలో 8500, ఉండ్రాజవరం మండలంలో 11,500, నిడదవోలు నియోజకవర్గంలో 16 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు.


ఉసులుమర్రులో విత్తే మెషీన్‌తో విత్తనాలు వేస్తున్న కూలీలు

ఆకుమడులు ఎలాగంటే..

విత్తనం విత్తే మెషీన్‌తో మొలకెత్తిన విత్తనాలను ట్రేలలో వేయాలి. ఎకరానికి 10 నుంచి 12 కిలోల విత్తనాలు సరిపోతాయి. ఇందుకు మొదట నారుమడి దమ్ము చేసుకోవాలి. ఎకరం చేనుకు 60 నుంచి 70 ట్రేలు అవసరమవుతాయి. ఈ ట్రేలను ఆకుమడిలో ఉంచి మట్టితో నింపుకోవాలి. ఈ ట్రేలకు ఇరువైపులా విత్తనం విత్తే మెషీన్ వెళ్లేందుకు ప్రత్యేకంగా తయారుచేసిన ఇనుప కమ్మెలను ఏర్పాటు చేసి, దానిపై మెషీన్‌ను అమర్చి అందులో విత్తనాలు వేసి సమంగా తీసుకువెళ్తే విత్తనాలు ట్రేలలో పడతాయి. ఈ ట్రేలలో వేసిన మడులకు ఎటువంటి ఎరువులు అవసరం లేదు. ఆకుమడిలో ఎటువంటి లోపాలున్నా అందుకు తగు మోతాదులో 70 ట్రేలకు కాంప్లెక్స్ అర కిలో, యూరియా పావుకిలో, పొటాష్ పావుకిలో మడులపై చల్లాలి. ఈ ఆకుమడి 14 రోజుల తర్వాత ఊడ్పు యంత్రంతో నాట్లు వేసుకోవచ్చు. ఖరీఫ్ సీజన్‌లో ప్రతి చదరపు మీటరుకు 33 మానులు వేయాలని, ఊడ్పు యంత్రంతో వేస్తే అవి సక్రమంగా పడతాయి.

సాధారణ ఆకుమడికి..

ఖరీఫ్ సాగులో వరినాట్లు జూలై 15 నాటికి పూర్తవ్వాల్సి ఉంది. ఆకుమడులు వేయాలంటే వారం రోజుల లోపు వేయాలి. ఈ అదును దాటితే ఆకుమడుల బదులు ఊడ్పు యంత్రాలతో ఖరీఫ్ సాగు చేయాలి. సాధారణ ఆకుమడి వేయాలంటే ఐదు సెంట్ల నారుమడికి 30 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. దమ్ము చేసిన తరువాత నునుపు చేశాక పరులు ఏర్పాటుచేయాలి. అనంతరం పల్చగా ఉండే నీటిని నిలువ కట్టి విత్తనాలు చల్లాలి.

యాజమాన్య పద్ధతులు

ఆకుమడికి దమ్ముచేసే సమయంలో 8 కిలోల సూపర్‌ఫాస్ఫేట్, 4 కిలోల యూరియా, 2 కిలోల పొటాష్ వేయాలి. విత్తనాలు చల్లిన మూడో రోజున కలుపు నివారణ కోసం ప్రిటిల్లాక్లోర్ 2 మిల్లీలీటర్ల మందులో ఒక లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలి. మడి వేసిన 12 రోజులకు 4 కిలోల యూరియా వెదజల్లాలి. ఈ నారుమడి 25 నుంచి 30 రోజుల వయస్సులో నాట్లు వేసుకోవాలి. ముప్పపురుగు ఎక్కువగా కనిపిస్తే మడి వేసిన 15 నుంచి 20 రోజుల వ్యవధిలో 5 మిల్లీలీటర్ల వేపనూనెను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఈ వేపనూనె ముప్పపురుగు, గుడ్డుముద్దలను నాశనం చేస్తుంది. ఆకును తీయడానికి వారం రోజుల ముందు త్రీజీ గుళికలు కిలోన్నర వేయాలి. ఇలా ఆకుమడి వేసి వరినాట్లు వేయడానికి ఎకరానికి రూ.8 వేలు ఖర్చు అవుతుంది. అదే ఊడ్పు యంత్రంతో ట్రేలలో ఆకుమడి వేసి వరినాట్లు వేస్తే కేవలం రూ.5200 నుంచి రూ.6 వేల ఖర్చు అవుతుంది. ప్రస్తుత పరిస్థితులను బట్టి సాధారణ ఆకుమడుల కన్నా యంత్రాలతో సాగుచేస్తేనే రబీ పంటకు ఎటువంటి అవరోధాలు లేకుండా పంట పండించవచ్చు.

తాగునీటి నాణ్యత పరిశీలన


ఆరికిరేవుల గ్రామంలో తాగునీటిని పరీక్షిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ సిబ్బంది

కొవ్వూరు: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా తాగునీటి నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ టి.రాజాతిలక్ తెలిపారు. గురువారం ఆరికిరేవుల, కుమారదేవం, చిడిపి గ్రామాల్లో ప్రజలకు డయేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. స్థానిక పంచాయతీ సిబ్బందికి, పంచాయతీ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు తాగునీరు పరీక్ష విధానాన్ని వివరించారు. గ్రామంలో ఎక్కడైనా తాగునీరు కలుషితం అవుతున్నట్టు అనుమానం ఉంటే టెస్టింగ్ చేసుకోవాలని, ఏదైనా వ్యత్యాసం కనిపిస్తే కొవ్వూరులో ఉండే తాగునీటి పరీక్ష కేంద్రానికి రావాలని ఆయన సూచించారు. ఈఓపీఆర్డీ కె.ఉమామహేశ్వరశర్మ, పంచాయతీ కార్యదర్శి జె.నరేంద్రబాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వి.జాన్‌కెనడీ, ఐ.వంశీ, ల్యాబ్ మైక్రో బయాలజిస్టు డి.సబిత, ల్యాబ్ అసిస్టెంట్ ఎస్ఎన్‌వీ గణేష్‌కుమార్, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అతిసార నియంత్రణపై అవగాహన

నల్లజర్ల: అతిసార వ్యాధి ప్రబలకుండా ముందస్తు చర్యలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ వైబీ సుందరి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాల్లో పరిశుభ్రత ఉండేలా చూడాలన్నారు. పిల్లలకు స్వచ్ఛమైన, వేడి ఆహారం అందించాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే ఇవ్వాలన్నారు. మురికి గుంటలు, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. నీటి గుంటల్లో దోమల లార్వాలు పెరిగి దోమల సమస్య తలెత్తుతుందన్నారు. దోమల లార్వా పెరగకుండా ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రం చేయించాలన్నారు. డ్రైన్లలో దోమల నివారణ మందు పిచికారీ చేయించాలన్నారు. రక్షిత మంచినీటి పథకాలను క్లోరినేషన్ చేయించాలని, పైపులైన్లలో లీకేజీలు ఉంటే, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ పద్మావతి, వైద్యారోగ్య శాఖ పీహెచ్ఎన్ రాధాకుమారి, హెచ్‌వీ అన్నమ్మ, సూపర్‌వైజర్ జీవీవీ ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, కృష్ణవేణి, ఎం.హారతి తదితరులు పాల్గొన్నారు.


అతిసారపై అవగాహన కల్పించే పోస్టర్లను ప్రదర్శిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

విద్యా సంస్థల బంద్


మలకపల్లిలో బంద్ నిర్వహిస్తున్న నాయకులు

తాళ్లపూడి: విద్యారంగంలో నెలకొన్న సమస్యలకు నిరసనగా మాదిగ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పలు విద్యాసంస్థలను గురువారం బంద్ చేయించారు. బంద్ సందర్భంగా మండలంలోని ప్రైవేట్ విద్యాసంస్థలు ముందుగానే సెలవు ప్రకటించాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గెద్దం వినోద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అనేక విద్యార్థి సంఘాల పిలుపు మేరకు బంద్ నిర్వహించినట్టు చెప్పారు. దేశవ్యాప్తంగా యూజీసీ నెట్, నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన పేపర్ లీకేజీ, ర్యాంకుల కేటాయింపులో అవకతవకల నేపథ్యంలో పరీక్షలను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు ఈ నెల 8న నీట్‌పై విచారణ చేపట్టనున్న పరిస్థితుల్లో విద్యార్థి, ప్రజా సంఘాల విజ్ఞప్తులను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొబ్బరాడ శివప్రసాద్, గెద్దం దిలీప్‌వర్మ, గౌతమ్ కుమార్, రాజేష్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం

ఉండ్రాజవరం: విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఉండ్రాజవరం మండలంలో చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎస్.కార్తీక్ తెలిపారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ నీట్ పరీక్ష రాసి నష్టపోయిన విద్యార్థులకు పరిహారం చెల్లించాలని, అవినీతి, అక్రమాలకు తావు లేకుండా నీట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు అశోక్, వెంకటేష్, మనోజ్, హర్షిత్, గంటా పవన్ పాల్గొన్నారు.

నిరంతర పోరాట యోధుడు వంగవీటి

- ఘనంగా వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు
- ప్రముఖులు, కాపు నాయకుల నివాళులు


పెద్దేవంలో వంగవీటి విగ్రహానికి పూలమాల వేస్తున్న తోట రామకృష్ణ తదితరులు


దేవరపల్లిలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కొవ్వూరు: బడుగు, బలహీన వర్గాలు, పేదల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం సాగించిన యోధుడు వంగవీటి మోహనరంగా చిరస్మరణీయుడని వక్తలు కొనియాడారు. కాపునాడు ఉద్యమ నేత వంగవీటి మోహన్‌రంగా 77వ జయంతి వేడుకలు గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మెరకవీధి వాటర్ ట్యాంకు వద్ద వంగవీటి విగ్రహానికి కాపు సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాపు సంఘం నాయకులు మారిశెట్టి వెంకటేశ్వరరావు, మైపాల రాంబాబు, నగ్గలపాటి శ్రీనివాస్, మురుకొండ శ్రీనివాస్, యాళ్ల నరసింహారావు, కొయ్యల భాస్కరరావు, గండ్రోతు శివరామకృష్ణ, చిలంకుర్తి బాబి, అడ్డూరి సుబ్బారావు, జొన్నల రాంబాబు, ఆవుల వాసు, అడ్డూరి సత్యనారాయణ, మానికిరెడ్డి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: మండలంలోని విజ్జేశ్వరం, డి.ముప్పవరం, తాడిమళ్ల, సమిశ్రగూడెం, అట్లపాడు గ్రామాల్లో కాపు ఉద్యమ నేత వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విజ్జేశ్వరంలో రంగా మిత్రమండలి అధ్యక్షుడు దేవన బాబూరావు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సర్పంచ్ తిక్కా శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. సమిశ్రగూడెంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్, జనసేన నాయకుడు ఉప్పులూరి రామ్మోహన్‌రావు, మాజీ సర్పంచ్ ఎండీ అక్రం, శ్రీకృష్ణదేవరాయ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

దేవరపల్లి: కాపు ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్‌రంగా జయంతి వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో వివిధ పార్టీల శ్రేణులు, కాపు సంఘాల నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మూడు బొమ్మల సెంటర్లోని వంగవీటి విగ్రహానికి జనసేన నాయకుడు డి.సువర్ణరాజు, కాపు సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు.


కొవ్వూరులో వంగవీటి విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న కాపు సంఘం నాయకులు


సమిశ్రగూడెంలో వంగవీటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు, నాయకులు

ఘనంగా వంగవీటి జయంతి

తాళ్లపూడి: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేగేశ్వరపురం, మలకపల్లి, అన్నదేవరపేట, తాళ్లపూడి, పెద్దేవం తదితర గ్రామాల్లో కాపు నాయకులు, యూత్ ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేశారు. రంగా విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంటా కృష్ణ, ఐతం మణికంఠ, దేవన సత్తిబాబు, రాగు వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పెద్దేవంలో వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలను నిర్వహించారు. వైఎస్సార్ సీపీ, జనసేన కాపు నాయకుల ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, ఇతర నాయకులు గంటా కృష్ణ, నామన చినబూరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి జయంతి వేడుకలు

ఉండ్రాజవరం: దివంగత కాపు నేత వంగవీటి మోహన్‌రంగా జయంతి వేడుకలను కె.సావారం, తాడిపర్రు తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా విగ్రహాలకు కాపు యువత ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

గిరిజనులకు అండగా నిలిచిన అల్లూరి

మంత్రి కందుల దుర్గేష్ నివాళి

నిడదవోలు: బ్రిటిష్ ప్రభుత్వంపై పోరాటం చేసిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పండగ వాతావరణంలో నిర్వహించడం అభినందనీయమని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పట్టణంలో గాంధీనగర్ సెంటర్లో ఉన్న అల్లూరి విగ్రహానికి గురువారం మంత్రి దుర్గేష్ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ బ్రిటిష్ వారిని పారద్రోలాలంటే వారితో సమానమైన శక్తి సామర్థ్యాలు ఉండాలని అతివాద మార్గాన్ని సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, బాలగంగాధర్ తిలక్ వంటి నాయకులు ఎన్నుకున్నారన్నారు. దేశాన్ని సర్వసత్తాక ప్రజాస్వామిక గణతంత్ర దేశంగా ప్రపంచ దేశాల ముందు నిలపాలన్నదే ఆ మహనీయుల ధ్యేయమన్నారు. సాయుధ పోరాటాన్ని ఎంచుకొని అల్లూరి గిరిజనులకు అండగా నిలిచి, వారిని బలోపేతం చేశారన్నారు. అనంతరం వంగవీటి మోహనరంగా విగ్రహానికి మంత్రి దుర్గేష్ నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బి.మేరీసుజాత, వైస్ ప్రిన్సిపాల్ డి.హరీష్ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి జరిగింది.


నిడదవోలులో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి దుర్గేష్

పేదల మనిషి వంగవీటి

పెరవలి: పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడిన నేత వంగవీటి మోహన్‌రంగా అని, రాజకీయంగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని పొందిన నాయకుడని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ కొనియాడారు. గురువారం కానూరు, ఖండవల్లి, అజ్జరం గ్రామాల్లో వంగవీటి, అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా వారి విగ్రహాలకు నివాళులర్పించారు. కాపు జాతి కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా భావించిన మహా మనిషి రంగా అని కొనియాడారు. అల్లూరి పోరాట ఉద్యమాన్ని వివరించారు. పోరాట నాయకుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని, సమాజానికి ఉపయోగపడే పనులను చేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ నీటి సంఘం అధ్యక్షులు బూరుగుపల్లి శ్రీనివాస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి జయంతి

కొవ్వూరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను పట్టణంలో గోదా వరి మాత క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ద్విసభ్య కమిటీ సభ్యులు కంతమణి రామకృష్ణ, జొన్నల గడ్డ సుబ్బారాయ చౌదరి, సూర్యదేవర రంజిత్, పెనుమాక జయరాజు, క్షత్రియ సేవా సంఘం, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: మన్యం వీరుడు అల్లూరి స్ఫూర్తి ప్రదాత అని క్షత్రియ సేవా సమితి పెండ్యాల గ్రామ అధ్యక్షుడు కంతేటి సీతారామరాజు అన్నారు. నిడదవోలు మండలం సింగవరం, పెండ్యాల, సమిశ్రగూడెం గ్రామాల్లో అల్లూరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించారు.

ఉండ్రాజవరం: మండలంలోని వెలగదుర్రులో క్షత్రియ సేవా సంఘం, సత్యవాడలో క్షత్రియ యూత్ సభ్యులు, వడ్లూరులో అల్లూరి సీతారామరాజు సేవా సమితి ఆధ్వర్యంలో అల్లూరి జయంతి వేడుకలు జరిగాయి. విద్యార్థులకు మిఠాయిలు పంచారు.


కొవ్వూరులో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


పెండ్యాల గ్రామంలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

విప్లవ వీరుడికి నివాళులు

తాళ్లపూడి: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర పోరాటంలో బ్రిటిష్ వారి వెన్నులో వణుకు పుట్టించిన యోధుడు అల్లూరి అని కొనియాడారు. ఏఎస్ఓ జె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గోదావరి జిల్లాలో పుట్టిన మహానుభావుడి జయంతి రోజున ఆయనను స్మరించుకోవడం అందరి బాధ్యత అని, అల్లూరి ధైర్యసాహసాలు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కిషోర్, సీనియర్ సహాయకులు సీతారామరాజు, వీఆర్‌ఏలు సురేష్, శ్రీలక్ష్మి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ఇళ్లలో మున్సిపల్ కార్మికులతో పనులా?

లిబరేషన్ కాంగ్రెస్ నేత రవిప్రకాష్

కొవ్వూరు: పురపాలక సంఘంలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొంతా శ్యాం రవిప్రకాష్ డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు 30 మందికి పైగా అధికారుల ఇళ్లల్లో పనిచేస్తున్నారని ఆరోపించారు. అసలే వర్షకాలం వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నప్పటికీ, పారిశుధ్య కార్మికులను ఇతర అవసరాలకు వినియోగించుకోవడం విచారకరమన్నారు. పురపాలక సంఘం ద్వారా నెలకు రూ.30 లక్షలకు పైగా కార్మికుల జీతాల కోసం ప్రజాధనం వెచ్చిస్తున్నారన్నారు. ప్రస్తుతం పట్టణంలో పారిశుధ్యం అధ్వాన్నంగా తయారైందని, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో పారిశుధ్య కార్మికుల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోకపోవడం దారుణమన్నారు. సచివాలయ శానిటరీ కార్యదర్శులు ఉండగా, శానిటరీ మేస్త్రులు ఎందుకని ప్రశ్నించారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులను ఇతర అవసరాలకు వినియోగించడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు శ్యాం రవిప్రకాష్ తెలిపారు.

బీజేపీ నుంచి బహిష్కరణ

నిడదవోలు: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న తాళ్లపాలేనికి చెందిన కార్యకర్త పినిశెట్టి సూర్యచంద్రరావును పార్టీ నుంచి బహిష్కరించినట్టు బీజేపీ మండల అధ్యక్షుడు మాట్ల వెంకటదుర్గారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొంతకాలంగా ప్రజల నుంచి అనధికారికంగా సొమ్ము వసూలు చేసి, పార్టీకి వ్యతిరేకంగా ఉన్నందున అతని ప్రాథమిక సభ్యత్వం రద్దు చేసినట్టు చెప్పారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్

90102 34548 (కొవ్వూరు)

90100 51493 (నిడదవోలు)

90100 68395 (గోపాలపురం)

Office mail : tpgadvt@gmail.com

మానవత డైరెక్టరీ ఆవిష్కరణ

నల్లజర్ల: మానవత డైరెక్టరీని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సంస్థలో రిటైర్డు ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్న దృష్ట్యా వారంతా సమీప పాఠశాలల్లో సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, కండెపు వెంకట సూర్యనారాయణ, భోగవల్లి వెంకటసుబ్బారావు, ఐడీబీ అప్పారావు, గుళ్లపూడి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.


డైరెక్టరీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

రోడ్డు మరమ్మతులు ప్రారంభం

కొవ్వూరు: గుత్తా వారి చెరువు సమీపంలో జగనన్న కాలనీ వెళ్లే రోడ్డు మరమ్మతులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు గురువారం ప్రారంభించారు. మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి రూ.10 లక్షలతో పనులు చేపట్టినట్టు ఎమ్మెల్యే చెప్పారు. మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

11న మోటారు సైకిళ్ల వేలం

కొవ్వూరు: వివిధ కేసుల్లో పట్టుబడిన మూడు మోటార్ సైకిళ్లను ఈ నెల 11న ఉదయం తమ కార్యాలయం వద్ద బహిరంగ వేలం వేస్తున్నట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పాల్గొనవచ్చన్నారు.